క్లుప్తంగా

గుంత పూడ్చారు



సాక్షి ఎఫెక్ట్..

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని పాత బజార్‌లో మున్సిపల్ సిబ్బంది పైపు లైన్ మరమ్మతుల కోసం పెద్ద గుంతను తీశారు. ప్రమాదకరంగా ఉన్న గుంతపై ఈనెల 6న 'సాక్షి'లో 'ప్రమాదకరంగా గుంత' అనే శీర్షిక కథనం ప్రచురితమైన విషయం విధితమే. దీనిపై డీఈ సీహెచ్ ఉపేందర్ వెంటనే స్పందించారు. జేసీబీతో గుంతను పూడ్చివేయించారు.

కోదాడలో వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు

డోర్నకల్: ఈనెల 10నుంచి సూర్యాపేట జిల్లా కోదాడలో రాష్ట్రస్థాయి ఓపెన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి మండలోజు సుధాకర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. పోటీల్లో పాల్గొనే సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్(బాల బాలికలు) ఈనెల 8వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాల కోసం 78428 03586 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

బాస్కెట్‌బాల్ జట్టుకు ఎంపిక

గార్ల: బాస్కెట్‌బాల్ జాతీయ జట్టుకు గార్లకు చెందిన సపావట్ సాయికుమార్ ఎంపిక య్యారు. పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, వైస్ చైర్మన్ గంగావత్ లక్ష్మణ్‌నాయక్, ఎస్సై ఎస్‌కె రియాజ్‌పాషా, పీడీ రామన్న, తదితరులు అభినందించారు.

కబ్జాదారులపై చర్య తీసుకోవాలి



మహబూబాబాద్ అర్బన్: మానుకోట పట్టణంలోని సర్వేనంబర్ 677 నుంచి 1,682 తదితర భూమిల్లో సుమారు 4ఎకరాల భూమిలో ప్రైవేట్ వెంచర్ ఉందని, అందులో గ్రీన్ ల్యాండ్ బోర్డు తీసేసిన వారిపై చర్య తీసుకోవాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దార్ల శివరాజ్ డిమాండ్ చేశాడు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో బీఎస్పీ నాయకులు మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గుగులోత్ నరేష్ నాయక్, రమేశ్, శ్రీను, రవితేజ పాల్గొన్నారు.

మల్లయ్యకు సావిత్రిబాయి పూలే అవార్డు




కురవి: మండల కేంద్రానికి చెందిన దళిత నాయకుడు కిన్నెర మల్లయ్యకు సావిత్రిబాయి పూలే ఎక్సలెంట్ జాతీయ అవార్డు అందుకున్నాడు. ఆదివారం హైదరాబాద్ చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో అవార్డుఅందజేసినట్లు మల్లయ్య తెలిపాడు.

సబ్‌స్టేషన్ నిర్మాణ స్థల పరిశీలన

బయ్యారం: మండలంలోని వెంకటాపురం పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురంలో సబ్‌స్టేషన్ నిర్మాణ స్థలంను విద్యుత్‌శాఖ ఎస్ఈ నరేష్ సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా వెంకటాపురం, మిర్యాలపెంట, ఇసుకమేధి పంచాయతీ పరిధిలోని రైతుల అవసరాల కోసం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సబ్‌స్టేషన్‌ను నిర్మించాలని తమకు సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ సుమన్, నాయకులు సోమేష్, వెంకన్న, వెంకటేశ్వర్లు, భాస్కర్ పాల్గొన్నారు.

ధనుర్మాస వ్రత పూజలు



మహబూబాబాద్ రూరల్: ధనుర్మాస వ్రత మహోత్సవ పూజలను పట్టణంలోని శ్రీరామ ఆలయంలో, మహేశ్వరీ భవనంలో వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ప్రత్యేక పూజలు, గోదాదేవి అమ్మవారిని పెళ్లికూతురు చేసే వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించి భక్తులు తమ భక్తిని చాటుకుంటున్నారు. శ్రీరామ ఆలయంలో ప్రధాన అర్చకులు ముత్తేవి వెంకటకృష్ణప్రసాద్, ముడుంబై లక్ష్మీనారాయణచార్యులు పూజలు చేస్తున్నారు.

బాబోయ్ కోతులు..!

- ఆహార పదార్థాల కోసం ఇళ్లలోకి చొరబడి ప్రజలపై దాడులు
- పంటలు ధ్వంసం.. ఆవేదనలో రైతన్న



గుర్తూరు గ్రామంలో సంచరిస్తున్న కోతుల గుంపు

తొర్రూరు రూరల్: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఇళ్ల చుట్టూ గుంపులుగుంపులుగా కోతులు సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళనతో జీవిస్తున్నారు. ప్రధానంగా తొర్రూరు, పెద్దవంగర మండలాల పరిధిలోని గ్రామాల్లో, పట్టణాల్లో కోతుల గుంపులు మనుషులపై దాడులు చేస్తున్నాయి. ఇళ్లలో చొరబడి ఆహార పదార్థాలు ఎత్తుకెళ్తున్నాయి. అంతే కాకుండా చిన్న పిలలు ఒంటరిగా ఇంటి నుంచి బయటకు వెళ్లే పరిస్థితితే లేకుండాపోయింది. ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే పెద్దవాళ్ల సహాయంతోనే బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. నిత్యం గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉండడంతో ప్రజలందరు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని, ఎప్పుడు ఏ కోతి దాడి చేస్తుందేమోనని భయంతో బతుకుతున్నారు.

పంటలను ధ్వంసం చేస్తున్నాయి..

గ్రామ శివారుల్లో సాగు చేస్తున్న పంటలను సైతం కోతులు ధ్వంసం చేస్తున్నాయి. కొన్ని గుంపులు ఇళ్లలో సంచరిస్తుంటే, ప్రస్తుతం సాగు చేస్తున్న మొక్కజొన్న, పల్లికాయ, కూరగాయలు, పత్తి, వరి పంటలను నాశనం చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల్లో కోతుల బెడద లేకుండా చూడాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

భయంతో జీవిస్తున్నాం..



గ్రామాల్లోని ఇళ్ల మీదనే కోతులు సంచరించడంతో భయంతో జీవిస్తున్నాం. ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను తీసుకెళ్లేందుకు ప్రజలపై దాడులు చేస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి కోతుల బెడదను అరికట్టాలి.

– భాస్కరాచారి, స్థానికుడు

దందాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

- ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్



నర్సింహులపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

నర్సింహులపేట: గ్రామాల్లో అక్రమ దందాలకు పాల్పడితే ఏవరినైనా ఉపేక్షించేది లేదని ప్రభుత్వ విప్‌జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ఇసుక, బెల్లం తదితర అక్రమ వ్యాపారాలకు చోటు లేదన్నారు. ఎవరైనా దందాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, వారిపై కఠిన చర్య తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతుభరోసా ప్రకటనపై సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఏఓ వినయ్‌కుమార్, ఎంపీడీఓ మాధవి, ఏఈ పాండు పాల్గొన్నారు. నర్సింహులపేట వచ్చే మార్గంలో ఉన్న పడమటిగూడెం యూపీఎస్‌ను సోమవారం ఎమ్మెల్యే అకస్మికంగా తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ వెనుక భాగంలో ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలంలో నర్సింహులపేట యూత్ అధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

దంతాలపల్లి: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం రైతువేదికలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ రాము, తొర్రూరు వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ బట్టు నాయక్, తహసీల్దారు కాటం చంద్ర రాజేశ్వర్, ఎంపీడీఓ వివేక్‌రామ్, తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ మరమ్మతు పనులు ప్రారంభం

మరిపెడ: గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. మరిపెడలోని ఆర్టీసీ బస్టాండ్ మరమ్మతు పనులను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు.

స్కీం వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉపేందర్



మాట్లాడుతున్న ఉపేందర్

నెహ్రూసెంటర్: స్కీం వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో సంఘ సమావేశం రాజు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్కీం వర్కర్ల బడ్జెట్ తగ్గిస్తూ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ కార్పొరేట్ అనుకూల చట్టాలను అమలు చేస్తున్నారని మండిపడ్డారు. పేద, మధ్య తరగతి ప్రజలపై ధరల భారాన్ని మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సమ్మెట రాజమౌళి, కుమ్మరికుంట్ల నాగన్న, తాడబోయిన శ్రీశైలం, గుగులోత్ సరోజ, దార స్నేహబిందు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'తో సంబంధం లేకుండా రూ.12వేలు ఇవ్వాలి



గార్ల: ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

గార్ల: ఉపాధిహామీ పథకం జాబ్‌కార్డుతో సంబంధం లేకుండా, వ్యవసాయ కూలీలందరికీ రూ.12వేలు ఇవ్వాలని కోరుతూ మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ మంగమ్మకు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వంగూరి పెద్దవెంకటేశ్వర్లు, నాగరాజు, రామకృష్ణ, కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

డోర్నకల్: ఉపాధి హామీ పనులతో సంబంధం లేకుండా వ్యవసాయ కార్మికులందరికీ సంవత్సరానికి రూ.12వేలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశాడు. సోమవారం తహసీల్దార్ కృష్ణవేణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అన్నెగాని శ్రీనివాస్, గాదె నాగేశ్వర్‌రావు, పెంటిక వెంకట్రాములు పాల్గొన్నారు.

'రైతు భరోసా' ప్రకటనపై రైతుల హర్షం



కురవి: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



డోర్నకల్‌లో..

కురవి: ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో సీఎం చిత్రపటానికి మహబూబాబాద్ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, సీరోలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొండపల్లి కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సీరోలు మండల కేంద్రంలో క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ సుధాకర్, సీరోలు మండల ఉపాధ్యక్షుడు మలిశెట్టి వేణు, బుడిగె లక్ష్మయ్య, గవిని వెంకన్న పాల్గొన్నారు.

డోర్నకల్: రైతుభరోసా పథకాన్ని ప్రకటించడాన్ని హర్షిస్తూ సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కాలా సుమేర్‌చంద్‌జైన్, మున్సిపల్ చైర్మన్ వీరన్న, నాయకులు శ్రీనివాస్, శీలం శ్రీనివాస్, హరికృష్ణ పాల్గొన్నారు.

పెద్దవంగర: సీఎం రేవంత్ రెడ్డి రైతు భరోసాపై ప్రకటన చేయాడాన్ని హర్షిస్తూ సోమవారం మండల కేంద్రంలో సీఎం, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, నాయకులు నెహ్రూ నాయక్, గోపాల్, పూర్ణచందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గూడూరు: కుటుంబ కలహాలతో ఒకరు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని కొల్లాపురంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఊరు గొండ్ల వెంకన్న (55) పెద్ద భార్య మృతిచెందగా, రెండో భార్య రాణితో కల్సి జీవిస్తున్నాడు. వారికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. పెద్ద భార్యకు ఒక కుమారుడు ఉండగా, అతను హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల వెంకన్న భార్య రాణితో గొడవపడి పెద్ద భార్య కుమారుడి వద్దకు హైదరాబాద్ వెళ్లాడు. ఉదయం పురుగుల మందు తాగి చనిపోగా, గుర్తించిన కొడుకు వెంటనే కొల్లాపురంలోని కుటుంబ సభ్యులకు సమాచారం అందించి తీసుకొచ్చాడు. పెద్ద కుమారుడు గోపి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్: ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పి.మధు డిమాండ్ చేశాడు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈసందర్భంగా మధు మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష ఉద్యోగులు 31రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సూర్యప్రకాష్, జ్యోతి, మహేష్, వినయ్, రాకేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థులకు గోల్డ్ మెడల్

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని హోలివర్ట్స్ హైస్కూల్ విద్యార్థులు హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించారని పాఠశాల డైరెక్టర్ అనుదీప్ అన్నారు. సోమవారం విద్యార్థులను పాఠశాల బృందం అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ జయశ్రీ, ప్రిన్సిపాల్ ఉదయశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ సాహితి పాల్గొన్నారు.

'ఉద్యోగ విరమణ సహజం'

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు ఉద్యోగ విరమణ సహజమని ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం ఆరుద్ర వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో సోషల్ టీచర్ వసంత సోమవారం పదవి విరమణ పొందగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు ప్రభుత్వ ధ్యేయం అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మిట్టకంటి రామిరెడ్డి, అల్లం నాగేశ్వర్ రావు, చిట్టెం వెంకన్న, నాయకులు ఎండీ.ఖలీల్, శంతన్ రామరాజు, పద్మం ప్రవీణ్ కుమార్, బండారు వెంకన్న పాల్గొన్నారు. అనంతరం జిల్లా నాయకులు మాధవపెద్ది రమేష్ చందర్ రెడ్డి నాయకత్వంలో పలువురు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. రైతు భరోసా ప్రకటనపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క చిత్రపటాలకు నాయకులతో కలిసి ఎమ్మెల్యే క్షీరాభిషేకం చేశారు. మహబూబాబాద్ మండలంలోని లక్ష్మి పురంతండా, కొమ్ముగూడెం గ్రామాల్లో ఎంఎస్ఆర్ఈజీఎస్ నిధులతో జరుగనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు సురేందర్, మంగిలాల్, వినయ్ పాల్గొన్నారు.

అభివృద్ధే ఎజెండాగా ముందుకు..

మహబూబాబాద్: అభివృద్ధే ఎజెండాగా ముందుకు వెళ్తూ దశలవారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు పరిధిలో సోమవారం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి రూ.5లక్షల వ్యయంతో నిర్మాణం చేయనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పోతురాజు రాజు, నాయకులు రాంరెడ్డి, రమేశ్, చాంద్, అశోక్, రామచంద్రు, దుర్గేష్ పాల్గొన్నారు.

'రైతు భరోసా' తగ్గింపుపై బీఆర్ఎస్ ధర్నా



డోర్నకల్: ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



పెద్దవంగరలో..



తొర్రూరులో..

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తుందని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. రైతులకు రూ.15వేల రైతుభరోసా ఇస్తామని చెప్పి ఇప్పుడు రూ.12వేలు ఇస్తామనడం సరికాదన్నారు.

– డోర్నకల్/తొర్రూరు/పెద్దవంగర/గార్ల/నెల్లికుదురు/నర్సింహులపేట

ఏఐసీటీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా అనిల్‌కుమార్



కేసముద్రం: ఏఐసీటీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా తుడుం అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా రాయబడి పాండురంగాచారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా నర్ర ప్రతాప్, ఉపాధ్యక్షులుగా సుంచు జగదీశ్వర్, మాలోతు జబ్బార్‌నాయక్, సహాయ కార్యదర్శులు కంచ వెంకన్న, ఎంఎస్ రావు, కోశాధికారి కర్ర దానయ్య ఎన్నికయ్యారు.

సంక్షిప్త సమాచారం

జీఓను అమలు చేయాలి

మహబూబాబాద్: సివిల్ సప్లై హమాలీ కార్మికుల పెంచిన ఎగుమతి దిగుమతి రేట్ల జీఓను వెంటనే అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.అజయ్‌సారథిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం సివిల్ సప్లై హమాలీ కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు జకరయ్య, రాంబాబు, నారాయణ, సతీష్, సైదులు, లక్ష్మీనారాయణ, శేఖర్ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

దంతాలపల్లి: దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ ఈనెల 9న తలపెట్టిన డిమాండ్ డే ను విజయవంతం చేయాలని అఖిల భారత యునైటెడ్ సంఘం జిల్లా కోశాధికారి రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దముప్పారం గ్రామంలో సోమవారం పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాములు, వెంకన్న, లింగయ్య, పెద్దయాకయ్య పాల్గొన్నారు.

సీపీఎం ధర్నా

కేసముద్రం: ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలంటూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు మార్తనేని పాపారావు, మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న, చాగంటి కిషన్, కావటి నర్సయ్య, నీరుటి జలేందర్ పాల్గొన్నారు.

యాదవులు రాజకీయంగా ఎదగాలి

మహబూబాబాద్: గొల్ల కురుమలు ఆర్థికంగా రాజకీయంగా ఎదగాలని మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్, సీనియర్ న్యాయవాది వెంకటయ్య వసుమతి అన్నారు. మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట సోమవారం గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం క్యాలెండర్లను నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఎడ్ల వేణుమాదవ్, మల్లయ్య, అశోక్, శ్రీనివాస్, కృష్ణ, మౌనిక, మహేష్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

నేత్రాల దానం

గార్ల: మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన ఇమ్మడి రాములమ్మ(80) మంగళవారం అనారోగ్యంతో మృతిచెందడంతో కుటుంబ సభ్యులు మృతురాలి కళ్లకు ఖమ్మం నేత్రనిధికి డొనేట్ చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

డోర్నకల్: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో సోమవారం టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్‌తోపాటు డైరీని ఎంఈఓ లక్ష్మానాయక్ సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వివేక్, మండల అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ అజీజ్, శివప్రసాద్ పాల్గొన్నారు.

హైబ్రిడ్ విత్తనాలతో అధిక దిగుబడులు



గార్ల: హైబ్రిడ్ మిరప విత్తనాలను ఎంచుకొని రైతులు సాగు చేయడం ద్వారా పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు సూచించారు. మంగళవారం మండలంలోని సీతంపేటలో బానోత్ ధర్మ ఎఫ్–1 హైబ్రిడ్ శివమ్–24 మిరప విత్తనాలు సాగుచేసిన తోటలో ఆయన క్షేత్ర ప్రదర్శన చేసి రైతులకు అవగాహన కల్పించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

నెల్లికుదురు: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇనుగుర్తి మండలం పెద్ద తండాలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లావుడ్యా సుక్య (44) మద్యానికి అలువాటుపడి పని చేయకుండా తిరుగుతున్నాడు. తల్లి లావుడ్యా బుజ్జి తాగుడుమాని పనికి వెళ్లాలని మందలించగా మనస్తాపంతో సుక్య పురుగుల మందుతాగాడు. చికిత్సనిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బైక్ ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

గార్ల: గార్ల నుంచి మర్రిగూడెం దేవాలయానికి బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి బైక్ పైనుంచి పడి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం రాత్రి గార్ల సమీపంలో చోటుచేసుకుంది. గార్లకు చెందిన వీరన్న అయ్యప్పమాల ధరించి దేవుడి దర్శనం కోసం గార్ల సమీపంలోని మర్రిగూడెం దేవాలయంకు బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యలో బైక్‌కు మేక అడ్డురావడంతో బైక్‌పై నుంచి కిందపడగా అతని కాలు విరిగింది. క్షతగాత్రుడిని హుటాహుటిన 108 సహాయంతో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఎమ్మెల్యేకు ఎస్ఎస్ఏ ఉద్యోగుల వినతి

మహబూబాబాద్ రూరల్: సమగ్ర శిక్ష ఉద్యోగులు ఎమ్మెల్యే మురళీనాయక్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మహంకాళీ వీరన్న కోరారు. కార్యక్రజుమంలో శంతన్ రామరాజు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నిరసన దీక్షకు కాంగ్రెస్ శ్రేణుల యత్నం

కేసముద్రం: కాంగ్రెస్ పార్టీలో మొదటి నుంచి కష్టపడిన తమకు తగిన గుర్తింపు దక్కడంలేదంటూ, కొంత మంది కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన దీక్ష చేపట్టేందుకు ప్రయత్నించడం చర్చానీయాంశంగా మారింది. ఇటీవల కాలంగా వరుసగా నామినేటెడ్ పదవులు ఓ వర్గానికి చెందిన వారికే వస్తున్నాయని ఆరోపిస్తూ, కొందరు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిరసన దీక్షకు దిగడానికి ప్రయత్నించారు. ఇంతలో జరుగుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మురళీనాయక్ తోపాటు, కాంగ్రెస్ పార్టీ పెద్దలు నిరసన తెలపడానికి వచ్చిన కాంగ్రెస్ నాయకులకు ఫోన్ చేసి నచ్చజెప్పారు. దీంతో నిరసన దీక్షను విరమించుకున్న పార్టీ శ్రేణులు, అక్కడి నుంచి మహబూబాబాద్‌కు వెళ్లి ఎమ్మెల్యేను కలిశారు. అధిష్టానంతో మాట్లాడి, న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే నచ్చజెప్పడంతో నాయకులు శాంతించారు.

విద్యార్థిని అనుమానాస్పద మృతి

- పూర్తిస్థాయి విచారణకు తల్లిదండ్రుల డిమాండ్

ఇబ్రహీంపట్నం రూరల్: ఓ ప్రైవేటు కళాశాలలో ఉంటూ నీట్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థిని అనుమానాస్పదంగా మృతి చెందింది. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా, పెద్దవంగర మండలం పోచంపల్లి గ్రామానికి చెందిన మైలపాకం అర్జున్ కూతురు సోని(19).. ఆదిబట్లలో అగస్త్య జూనియర్ కళాశాల హాస్టల్‌లో ఉంటూ.. నీట్ కోచింగ్ తీసుకుంటోంది. ఈనెల 4న జ్వరం రావడంతో ఆమెను మన్నెగూడలోని మహోనియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ విషయం యువతి తల్లిదండ్రులకు చెప్పగా.. వైద్య ఖర్చులకు రూ.వెయ్యి ఫోన్ పే చేశారు. ఆ తర్వాత సాయంత్రం 6 గంటలకు కడుపు నొప్పి రావడంతో వైద్యం చేయించారు. 5న అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో మరోసారి కడుపునొప్పి రావడంతో అదే ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో నగరంలోని యశోదకు తరలించారు. అప్పటికే సోని మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇదిలా ఉండగా.. అప్పుడప్పుడు సోనికి మైగ్రేన్ వస్తుండేదని, ఆమె మృతిపై సరైన విచారణ జరపాలని యువతి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కళాశాల యాజమాన్యంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

రూ.12 లక్షల పరిహారం..?

యువతి మృతిపై తల్లిదండ్రులు, బంధువులు అనుమానం వ్యక్తం చేస్తూ ఆందోళన చేయడంతో కాలేజీ యాజమాన్యం రాత్రికి రాత్రే రూ.12 లక్షల నష్టపరిహారం చెల్లించినట్లు తెలుస్తోంది. ఇదే విషయమై ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు కళాశాల యాజమాన్యాన్ని వివరణ కోరగా.. ఎలాంటి సమాధానం రాలేదు. దీంతో వారు పూలకుండీలు, కుర్చీలు ధ్వంసం చేయగా.. వారిపై యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది.